నారాయణఖేడ్ : రంజాన్ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు కానుకలు సమర్పిస్తున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాబేగం నజీబ్

హత్నూర : దౌల్తాబాద్‌లో రంజాన్ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

సంగారెడ్డి : ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జిన్నారం : ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి

జహీరాబాద్ పట్టణ సమీపంలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కందిలో మైనార్టీ నాయకులను కలిసి ఈద్ ముబారక్ తెలుపుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

రంజాన్‌ను సోమవారం సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు అలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. నెల రోజులుగా చేపట్టిన ఉపవాస దీక్షలను రంజాన్‌తో విరమించారు. ఆయా మండలాల్లోని వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలను తెలియజేశారు.

- సంగారెడ్డి జిల్లానెట్‌వర్క్, మార్చి 31

కొండాపూర్ : ఈద్‌ముబారక్ చెప్పుకుంటున్న చిన్నారులు

మునిపల్లి : పెద్దచెల్మెడలో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొంటున్న అన్నదమ్ములు

కోహీర్ : బిగ్వాల్ గ్రామంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

ఈద్ ముబారక్

రాయికోడ్ : నాగ్వార్‌లో రంజాన్ వేడుకలు

అందోల్ : జోగిపేటలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

జహీరాబాద్ పట్టణంలో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్

రామచంద్రాపురం : ఆర్సీపురంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పుల్కల్‌లో ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలుపుకొంటున్న ముస్లింలు

మనూరు : ఎల్గోయి గ్రామంలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేభూపాల్‌రెడ్డి

జహీరాబాద్ ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన

నల్ల రిబ్బన్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

కొండాపూర్, మార్చి 31 : మండల పరిధిలోని అనంతసాగర్‌లో వక్ఫ్ సవరన బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు సోమవారం రంజాన్ పండగ సందర్భంగా నిరసన వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరన బిల్లు పేరుతో వక్ఫ్ ఆస్తులను కాజేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని, ఇది హేయమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లులు ఉపసంహరించకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో మాజీ జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు అమినొద్దీన్, ముస్లిం పెద్దలు వహీద్, జలీల్, జాకీర్, అజీంపాషా, మోహిన్, మహమూద్, చాంద్‌పాషా, ఆయాజ్ తదితరులు పాల్గొన్నారు.

చివరి రోజు దూకుడుగా ఆస్తి పన్ను వసూలు

జిన్నారం, మార్చి 31 : ఆస్తి పన్ను బకాయిలపై వన్ టైం సెటిల్‌మెంట్ పథకంలో భాగంగా బకాయిదారులు చివరి రోజు ఉత్సాహంగా ఆస్తి పన్ను చెల్లించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా కేవలం ఒక్క రోజులోనే రూ.24.84 లక్షల ఆస్తి పన్ను చెల్లించారని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. పారిశ్రామిక వాడలోని విజయ ఐరన్ ఫౌండ్రీ లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యం రూ.9,57,851 ఆస్తి పన్ను చెల్లించినట్లు వెల్లడించారు. మునుపెన్నడూ లేని విధంగా నేటి వరకు రూ.14.07 కోట్ల ఆస్తిపన్నులు వసూలు చేశామన్నారు. పన్ను వసూళ్లలో 88 శాతం నమోదైందన్నారు. పన్నులు చెల్లించేందుకు సహకరించిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికార యంత్రాంగం, సిబ్బందికి కమిషనర్ ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్వో నర్సింహులు, ఏఈ కిష్టయ్య, సీనియర్ అకౌంటెంట్ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

ఉద్యమం ఉధృతం చేస్తాం..

55వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు



సంఘం సభ్యులకు సంఘీభావం తెలుపుతున్న జేఏసీ నాయకులు

గుమ్మడిదల,మార్చి 31 : ప్యారానగర్ డంపింగ్‌యార్డును రద్దు చేసే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జేఏసీ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కేంద్రంలో అనంతారం కుర్మ సంఘం సభ్యులు 55వ రోజు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. దీనికి జేఏసీ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిన్నపాపని కుమార్ గౌడ్, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు. నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రిలే నిరాహారదీక్షలో రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ డంపింగ్‌యార్డును రద్దు చేసే వరకు ఉద్యమం తీవ్రరూపం దాల్చుతుందన్నారు. రిలే నిరాహారదీక్షలో కూర్చుంటున్నారు. డంపింగ్‌యార్డు వల్ల ఇక్కడి గ్రామాల ప్రజలకు నష్టం వాటిల్లుతుందని హెచ్చరిస్తున్నా రాష్ట్ర పాలకవర్గం కనీసం స్పందించకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా స్పందించి డంపింగ్ యార్డు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోచుగారి మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, దోమడుగు బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కుమ్మరి ఆంజనేయులు, మన్నె రామకృష్ణ, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్, కొరివి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, మార్చి 31 : బీఆర్ఎస్ కార్యకర్తను హత్య చేయడం పిరికి పంద చర్యయని హత్యా రాజకీయాలను మానుకొని ప్రజల సంక్షేమానికి పాటుపడాలని సోమవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి హితవు పలికారు. కల్హేర్ మండల పరిధిలోని కొత్తచెరువు తండాకు చెందిన విస్లవత్ హరిసింగ్‌ను కల్హేర్ పొమ్యానాయక్ తండా మధ్య నీలంవాగు వద్ద హత్య గురికావడంతో సంఘటన స్థలానికి చేరుకొని తండావాసులతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఆరాచకాలను నిలిపి వేయకపోతే ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. హంతకులను పట్టుకోవడానికి డాగ్‌స్కాడ్, క్లూస్ టీమ్‌లను తెప్పించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హత్యకు ప్రోత్సహించిన వారిని, హత్య చేసిన వారు ఎంతటి వారైనా పోలీసులు పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేశారు. వెంట మాజీ జడ్పీటీసీ నర్సింహరెడ్డి, మండలాధ్యక్షుడు రాంసింగ్, మాజీ ఎంపీటీసీ సంగప్ప, నాయకులు జలంధర్, బాలయ్య, సాయిలు, నర్సింహగౌడ్, హన్మంత్‌రావు, ప్రభుగౌడ్, శ్రీనివాస్ గౌడ్, గణపతి, లక్ష్మణ్, పండరి, విఠల్ తదితరులు ఉన్నారు.

లైంగికదాడికి పాల్పడిన ఇద్దరు అరెస్టు

వివరాలు వెల్లడించిన ఎస్పీ పారితోష్ పంకజ్

కంది, మార్చి 31 : వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరు యువకులు అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ పేర్కొన్నారు. ఈ నెల 25న అర్ధరాత్రి కంది మండలం మామిడిపల్లి చౌరస్తా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఇద్దరు యువకులు భర్తపై దాడి చేసి భార్యపై లైంగికదాడికి పాల్పడిన సంఘటన తెలిసిందే. ఈ కేసులో సంగారెడ్డి పట్టణానికి చెందిన యువకులుగా గుర్తించిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 25న పనిమీద సంగారెడ్డికి వచ్చిన భార్యాభర్తలు వారి సొంత ఆటోలోనే హత్నూరకు బయలుదేరారు. అర్ధరాత్రి ఒకటి ప్రాంతంలో వారి ఆటో జాతీయ రహదారి నుంచి మమాడిపల్లి చౌరస్తా సర్వీస్ రోడ్డుకు మళ్లింది. రోడ్డులోనే ఇద్దరు యువకులు మద్యం సేవిస్తున్నారు. ఆటోలో ఒంటరిగా మహిళను గమనించిన యువకులు వారి స్కూటీతో వెంబడించారు. ఆటో నడుపుతున్న భర్త కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆటోను ఆపి పక్కకు వెళ్లగా, ఇదే అదునుగా భావించిన యువకులు భర్తపై దాడిచేసి వివాహితను బెదిరించి స్కూటీపై నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా పట్టుకున్నారు. సోమవారం ఉదయం ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా, నేరాన్ని అంగీకరించారు. సమావేశంలో డీఎస్పీ సత్తయ్యగౌడ్, సంగారెడ్డి రూరల్ సీఐ క్రాంతికుమార్, టాస్క్‌ఫోర్స్ సీఐ శివ కుమార్, ఎస్సైలు రవీందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పారితోష్ పంకజ్

ఎంఐజీలో శాంతి ర్యాలీ

ఎంఐజీలో కొవ్వత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

రామచంద్రాపురం, మార్చి 31 : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంఐజీ ఫేజ్-2 విద్యుత్‌నగర్‌కాలనీలో ఫాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా సోమవారం క్రైస్తవులు శాంతి ర్యాలీని నిర్వహించారు. విద్యుత్‌నగర్‌కాలనీ ప్రధాన రోడ్డు మార్గం నుంచి క్రైస్తవులు కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారు కోరారు. తిమోతి, ఆశీర్వాదం, కృపానందమ్, జాషువా, రమేశ్ పాల్గొన్నారు.

షీ టీమ్స్‌పై విద్యార్థులకు అవగాహన

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 31 : తారా ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు 2,3,4ల ఆధ్వర్యంలో మండల పరిధిలోని కలబ్‌గూర్ చింతలపల్లి, అంగడిపేట దత్త గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక శీతాకాల శిబిరాల్లో భాగంగా సోమవారం షీ టీమ్స్‌పై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతకుముందు విశ్రాంత అధ్యాపకుడు అల్లంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని జీవితానికి బాటలు వేసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సదయ్య కుమార్, డాక్టర్ జగదీశ్వర్, షీ టీమ్స్ సంతోషి పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో మందుబాబుల వీరంగం

జిన్నారం, మార్చి 31 : జిన్నారం మండల కేంద్ర సమీపంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట గల రహదారిపై ఎస్సై నాగలక్ష్మి సిబ్బందితో సోమవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ కారును ఆపి పోలీసులు తనిఖీలు చేస్తుండగా, వెనక నుంచి వచ్చిన మరో కారు ఆపి తనిఖీ చేసే క్రమంలో మద్యం మత్తులో ఉన్న ఆ కారులోని ఇద్దరు వ్యక్తులు పోలీసుల కండ్లుగప్పి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ముందున్న కారును ఢీ కొట్టడమే కాకుండా ఆపేందుకు ప్రయత్నించిన ఎస్సై నాగలక్ష్మీకి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కారును వెంబడించారు. లక్ష్మీపతి గూడెం వద్ద ఆగి ఉన్న కారును అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే మందు బాబులు ఇద్దరు కారును వదిలేసి పరారయ్యారు. కారును స్టేషన్ తరలించినట్లు ఎస్సై నాగలక్ష్మి తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరుపుతామన్నారు.

మల్లన్న జాతరలో బీఆర్ఎస్ నాయకుల పూజలు

జిన్నారం, మార్చి 31: సోలక్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఇమామ్‌నగర్‌లో మల్లన్న జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మలన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజేశ్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, శివరాజ్, జనార్దన్, ఆంజనేయులు కృష్ణ గౌడ్, శాంత వర్మ రెడ్డి, రామకృష్ణ, పరమేశ్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో బీఆర్ఎస్ నాయకులు

నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదగాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 31 : రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారితో కలిసి జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుదారులకు రెవెన్యూ అధికారులు కుల, ఆదాయ ధ్రువపత్రాలు వెంటనే మంజూరు చేయాలని పేర్కొన్నారు. పథకం ఒక కుటుంబంలో ఒక వ్యక్తికి మాత్రమే వర్తిస్తుందని విస్తృత ప్రచారం చేయాలన్నారు. వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉన్నవారందరూ అర్హులే అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ సంక్షేమ శాఖల అధికారులు అఖిలేశ్‌రెడ్డి, జగదీష్, రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

అందోల్‌లో జర్నలిస్టును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

అందోల్, మార్చి 31 : గాయపడిన జర్నలిస్టును మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సోమవారం పరామర్శించారు. అక్రమ రేషన్ బియ్యం వ్యాపారాన్ని వెలుగులోకి తీసుకు వస్తే దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ జైపాల్ రెడ్డి, నాయకులు విజయ్ కుమార్, వెంకటేశం, జర్నలిస్టు సంఘం నాయకులు ప్రదీప్‌గౌడ్, పవన్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బొల్లారంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి

జిన్నారం, మార్చి 31 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలో మున్సిపల్ ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ చంద్రయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో బాటసారులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాయకులు జైపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, కృష్ణంరాజు, చక్రపాణి, వెంకటయ్య, రాజ్ గోపాల్, ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి

జహీరాబాద్, మార్చి 31 : జహీరాబాద్ పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జహీరాబాద్ పట్టణ అంబేద్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బీ. నర్సయ్య తెలిపారు. స్థానిక పట్టణంలోని సోమవారం అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా బీ. నర్సయ్య, కోశాధికారిగా బిచ్చయ్యలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో అంబేద్కర్ ఉత్సవ కమిటీ నాయకులు రాంచందర్ భీమ్‌వంశీ, మొగులయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్టు అమలు

సంగారెడ్డి, మార్చి 31 : జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నెల రోజుల పాటు 30,30(ఎ) పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని, పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ పారితోష్ పంకజ్ సోమవారం హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు 30, 30(ఎ) పోలీస్ చట్టం 1861 ప్రకారం ఏప్రిల్ ఒకటి నుంచి 30 వరకు అమలులో ఉంటుందని సూచించారు. జిల్లా పరిధిలో ముందస్తూ పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, మైకు పెట్టుకొని తిరగడం, సభలు, సమావేశాలు, నిరాహార దీక్షలు నిర్వహించరాదన్నారు. ప్రజా ధనానికి నష్టం కలిగించే, చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదని స్పష్టంచేశారు. జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు నిర్వహించే నిఘా, బందోబస్తుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. ఒకవేళ పోలీసుల అనుమతి లేకుండా సమావేశాలు ఏర్పాటు చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

పండుగ రోజు తాగు నీళ్లు కరువు

అధికారులకు విన్నవించిన సీపీఐ నాయకులు

సంగారెడ్డి, మార్చి 31 : తాగడానికి చుక్క నీరు రాక పండుగ రోజు నీళ్ల కోసం పట్టణ వాసులు ఎదురుచూపులు చూసి అధికారులపై పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, ఆదిత్యనగర్ కాలనీ అధ్యక్షుడు సాయిలు సోమవారం ఆరోపించారు. పట్టణంలో రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడంతో పట్టణవాసులు అధికారులపై మండిపడుతున్నారని విమర్శించారు. పట్టణంలోని ఆదిత్యనగర కాలనీ, వసంత నగర బర్మా కాలనీ, ఓడీఎఫ్ కాలనీ, బ్యాంకు కాలనీ, పోతిరెడ్డిపల్లి చౌరస్తా 12వ వార్డుల్లో మంజీరా నీరు రెండు రోజుల నుంచి రాలేదని అందులో పండుగలు ఉన్న మున్సిపల్ అధికారులకు ముందు చూపు లేకపోవడంతో నీటి కొరత ఏర్పడిందని వాపోయారు. ఎండలు అధికం కాకముందే అధికారులు స్పందించి నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకొని పట్టణవాసుల దహార్తిని తీర్చాలని కాలనీ వాసులు కోరారు.